

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,660
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,329

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,900
రిటైల్ వెండి గ్రాము	రూ.73.90

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	18
చిత్తూరు	32	18
తిరుమల	28	14
గూడూరు	33	20
నగరి	33	18



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. గురువారం 60,609 మంది దర్శించుకోగా, హుండీ కానుకలు రూ.3.13 కోట్లు సమర్పించారు.

న్యూస్‌రీల్

బాలాలయ పూజలు



భక్తకన్నప్ప ధ్వజస్తంభానికి ఏర్పాటు చేయనున్న పంచలోహ తొడుగులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా భక్తకన్నప్ప ఆలయంలో ధ్వజస్తంభ బాలాలయ పూజలు శుక్రవారం ఆగమోక్తంగా నిర్వహించారు. కలశస్థాపన చేసి హోమపూజలు నిర్వహించారు. అనంతరం భక్తకన్నప్ప సన్నిధి వద్ద ధ్వజస్తంభ నమూనాను ఉంచారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఆలయానికి శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి రూ.8లక్షలు విలువ చేసే పంచలోహ తొడుగులను వితరణ చేశారు. అదే విధంగా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలోనూ బాలాలయ పూజలు చేపట్టారు. కలశస్థాపన, వినాయకపూజ, హోమపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌కు ఐవోసీఎల్ రూ.22 కోట్ల విరాళం



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఐవోసీఎల్

తిరుపతి అలిపిరి: స్విమ్స్‌లో వైద్య పరికరాల కొనుగోలు కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) రూ.22 కోట్లు విరాళంగా అందించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో శుక్రవారం ఈవో ఏవీ ధర్మారెడ్డి సమక్షంలో ఐఓసీఎల్, స్విమ్స్ అధికారులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఐవోసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, స్విమ్స్ లో రోగులకు వైద్య సహాయం అందించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ఈ నిధులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ గురుమూర్తి, జేఈవో సదా భార్గవి, స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, మెడికల్ సూపరింటెండెంట్ రామ్‌తో పాటు ఐవోసీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రామకృష్ణ తీర్థ ముక్కోటి రేపు

తిరుమల: రామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం పీఏసీ–4 లోని మీటింగ్ హాల్‌లో తిరుమల వీజీవో బాలిరెడ్డి, తిరుమల అడిషనల్ ఎస్పీ శ్రీ మునిరామయ్య ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాపవినాశనం వద్ద పార్కింగ్ సమస్య దృష్ట్యా తిరుమల నుంచి గోగర్భం డ్యాం సర్కిల్ మీదుగా ఒక్క రోజు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. ఈనెల 5న రామ కృష్ణ తీర్థానికి వెళ్లే భక్తులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వీజీవో గిరిధర్, డీఎఫ్‌వో శ్రీనివాస్, డీఎం విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్తంగా నిర్వహించనున్న ప్లంబర్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సహాయసంచాలకులు కే.విజయప్రతాప్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 90 రోజులు శిక్షణ కాలంలో స్టేషనరీ, యూనిఫాం అందించడంతోపాటు 15 కిలో మీటర్ల లోపు ఉన్నవారికి ఉచిత బస్సు పాస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వివరాల కోసం 9700413939, 9000894035ను సంప్రదించాలని ఆయన కోరారు.

పల్లె సీమల్లో పట్టణ సొగసులు

నాడు అవి మారుమూల పల్లెలు.. ఉపాధి మార్గాలు అసలే లేవు.. అరకొర వ్యవసాయమే వారికి జీవనాధారం. నాడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ఆ పల్లెటూళ్లు.. నేడు పట్టణ సొగసులతో అలరారుతున్నాయి. జిల్లాలోనే వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏర్పాటు చేసిన శ్రీసిటీ సెజ్ పల్లెల రూపురేఖలను మార్చేసింది. ఆ గ్రామాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతోపాటు ప్రజల జీవన శైలి పూర్తిగా మారిపోయింది.

- కార్మికులుగా వ్యవసాయ కూలీలు
- సొంతూర్లోనే ఉద్యోగాలు
- పూరిళ్ల స్థానంలో వెలిసిన మిద్దెళ్లు
- శ్రీసిటీ సెజ్‌తో మారిన జీవనశైలి

వరదయ్య పాళెం: శ్రీసిటీ సెజ్‌తో ఇక్కడి ప్రజల జీవన స్థితి, శైలి పూర్తిగా మారింది. పూరి గుడిసెల స్థానంలో మిద్దె ఇళ్లు వెలిశాయి. గ్రామాన్ని ఆనుకుని 4 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, క్రియా జాతీయ విశ్వవిద్యాలయం, చుట్టూ అంతర్జాతీయ పరిశ్రమలు, వివిధ రకాల దుకాణాలు, హోటళ్లు, అతిథి గృహాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయం పూర్తిగా కనుమరుగైంది. కూలీలు, కార్మికశక్తిగా మారారు. 90శాతం మంది 5వతరగతి లోపు చదువుకున్నవారే. అయినప్పటికీ భార్యాభర్తలిద్దరూ సమీప పరిశ్రమలు, యూనివర్సిటీల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. కొందరు సొంత వ్యాపారాలు నడుపుతున్నారు. ప్రతి ఇంటికీ రెండు బైక్‌లు, ఊర్లో ఐదారు కార్లు దర్శనమిస్తున్నాయి. పిల్లలను సమీపంలోని కార్పొరేట్ స్కూళ్లకు పంపుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ కుగ్రామం పట్టణమైంది. వారి గ్రామీణ జీవన స్థితి నేడు నగర జీవన శైలికి మారింది. శ్రీసిటీలోని దాదాపుగా అన్ని గ్రామాల్లోనూ కనిపిస్తున్నాయి. పుష్కలమైన ఉపాధి అవకాశాలతోపాటు గ్రామాల మధ్యలోనే కార్పొరేట్ స్కూల్స్, హాస్పిటల్స్, బ్యాంకులు, పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, ఇతర పలు సామాజిక వసతులు సమకూరాయి. అక్కడ పల్లెలన్నీ పట్టణీకరణ దిశగా పయనిస్తున్నాయి.

మహానేత ముందుచూపే కారణం

ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధిలో ఎంతో వెనుకబడింది. నియోజకవర్గంలో తొలిసారిగా బస్సు యాత్ర ద్వారా పర్యటించిన వైఎస్ రాజశేఖర రెడ్డి స్థానిక పరిస్థితులను అధ్యయనం చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే 8.8.2008న 7వేల ఎకరాల్లో శ్రీసిటీ పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తూ తొలిసారి 8 పరిశ్రమలకు పునాదిరాయి వేశారు. అక్కడ నేడు 200 పరిశ్రమల ఏర్పాటుతో 50వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పిస్తోంది. దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామికవాడగా పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకుంటూ, పారిశ్రామికవాడ కోసం భూములిచ్చిన 14 గ్రామాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయి.



మిద్దెళ్లు, పచ్చనిచెట్లతో కళకళలాడుతున్న చెరివి దళితవాడ

వరదయ్యపాళెం

ఇక్కడో భారీ సెజ్ వస్తోంది. అంతగా ఆదాయం లేని మీ భూములన్నీ వారు తీసుకుంటారు. వందలాది పరిశ్రమలు, మంచి స్కూళ్లు, ఆస్పత్రులు, వేలాది ఉద్యోగాలు, ఇతర సదుపాయాలన్నీ వస్తాయి. భూ పరిహారంతోపాటు మీ గ్రామాలు ఇక్కడే ఉంటాయి. మీ జీవితాలే మారిపోతాయి అంటూ 14 ఏళ్ల క్రితం శ్రీసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన 14 గ్రామాల్లో భూముల సేకరణ ప్రారంభించింది. అయితే ఎవరూ నమ్మలేదు. వీరంతా మాయ మాటలు చెబుతున్నారు.. ఇన్ని వేల ఎకరాలు అవసరమా అంటూ ప్రశ్నలు లేవనెత్తారు. భవిష్యత్తుపై ఆశలతో పలు సందేహాల నడుమ భూములిచ్చారు. అయితే ఆనాటి హామీలన్నీ అక్షర సత్యాలుగా మారి నేడు మనముందు దర్శనమిస్తున్నాయి. సెజ్‌లోని పల్లెలు, వారి జీవన శైలే అందుకు సాక్ష్యాలుగా మారాయి.

చెంగంబాక్కం..



శ్రీసిటీలో అభివృద్ధి చెందిన చెంగంబాక్కం

సత్యవేడు మండలంలోని మారుమూల గ్రామం. ఇక్కడ 60 కుటుంబాలున్నాయి. ఇందులో సగానికి పైగా దళితులు, 90 శాతం పూరి గుడిసెలు, 10 కుటుంబాలు మినహా మిగిలిన వారు ఒక ఎకరా, రెండెకరాల రైతులు, కొందరు అది కూడా లేని కూలీలు. ఏడాదికోసారి వచ్చే ఒక్క పంటే అందరికీ జీవనాధారం. ఏడాది మొత్తం నిశ్చింతగా మూడు పూటలా తిండికి భరోసా లేదు. రాకపోకలకు రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి రోడ్డు మార్గం చేరుకుని బస్సు ఎక్కాలి. గ్రామం మొత్తంలో ఓ మూడు, నాలుగు కుటుంబాలకే బైక్‌లు ఉండేవి. అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైతే మండల కేంద్రానికి, ఇతర పెద్ద ఆస్పత్రులకు వెళ్లేందుకు పడరాని పాట్లు. పిల్లల చదువులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకే పరిమితం. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తల్లిదండ్రులు పిల్లల చదువులపై అంత శ్రద్ధ చూపేవారు కాదు. భర్తల సంపాదనపైనే కుటుంబం గడిచేది. మహిళలు వంటింటికే పరిమితం. ఇలా కుటుంబ పోషణకు అగచాట్లు పడేవారు. అయితే ఇదంతా పుష్కర కాలం ముందు మాట. ఇప్పుడు అంతా మారిపోయింది.

ఇంట్లో ఇద్దరికీ ఉద్యోగం



నేను, నా భర్త ఇద్దరూ 5లోపే చదువుకున్నాం. శ్రీసిటీ రాకమునుపు వ్యవసాయ కూలీయే జీవనాధారం. పూరింట్లో ఉండేవాళ్లం. కుటుంబ పోషణ అతి కష్టంగా సాగేది. సరైన రోడ్లు, రవాణా, విద్య, వైద్య వసతులు లేవు. శ్రీసిటీ వచ్చిన తర్వాత గడిచిన పదేళ్లలో మా జీవితం ఊహించని మలుపు తిరిగింది. నేను వందడుగుల దూరంలో ఉన్న క్రియా యూనివర్సిటీలో హౌస్ కీపింగ్ ఉద్యోగం, నా భర్త శ్రీసిటీలో సెక్యూరిటీగా పనిచేస్తూ ప్రస్తుతం ప్రతినెలా రూ.25వేలు సంపాదిస్తున్నాం. మంచి ఇల్లు కట్టుకున్నాం. మా అబ్బాయి ఇంటర్ పూర్తి చేసి, ప్రస్తుతం సీఏ కోర్సు చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. మా పాప 8 చదువుతోంది. గ్రామంలో మంచి రోడ్లతోపాటు సమీపంలోనే అన్ని అధునాతన వసతులు ఉన్నాయి.

–మంజుల దంపతులు, చెంగంబాక్కం గ్రామం

గ్రామాల్లో నగర వసతులు



మాది శ్రీసిటీ పరిధిలోని మల్లవారిపాళెం వెస్ట్ గ్రామంలోని రైతు కుటుంబం. నేను బీసీఏ చదివాను. సరైన ఉద్యోగం కోసం వెదుకులాటలో కొన్నాళ్లు చెన్నైలో, ఆపై దుబాయ్‌లో ఉద్యోగం చేశాను. మాది చిన్న పల్లెటూరు కావడంతో సరైన రోడ్లు, రవాణా సౌకర్యాలు, విద్య, వైద్య వసతులు లేవు. శ్రీసిటీ రాకతో అంతా మారిపోయింది. వందకు పైగా పరిశ్రమలు వచ్చాయి. మా ఊరికి ఆనుకుని వంద మీటర్ల దూరంలో సిద్ధార్థ లాజిస్టిక్స్ అంతర్జాతీయ పరిశ్రమలో మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. డిగ్రీ పూర్తి చేసిన నా భార్యకు కూడా ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం వచ్చింది. ఇంటి నుంచి నడుచుకుంటూ ఉద్యోగానికి వెళ్లివస్తున్నాము. మా పిల్లలను శ్రీసిటీలో కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తున్నాము. గ్రామీణ వాతావరణంలో నగర వసతులతో హాయిగా జీవనం సాగిస్తున్నాము.

–నవీన్ దంపతులు, మల్లవారిపాళెం వెస్ట్ గ్రామం

పేదల అభ్యున్నతికే తొలి ప్రాధాన్యం



గర్భిణులను ఆశీర్వదిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కాణిపాకంలో పూజాసామగ్రి తీసుకువస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

- ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు
- విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల : పేదల అభ్యున్నతికే తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, బోడిపాటివారిపల్లె పంచాయతీల్లో ఆయన పల్లెబాట నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరుస్తున్నామని వెల్లడించారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా గానుగచింత పంచాయతీలో పల్లెబాట కార్యక్రమంపై ఎవరికీ సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపిన ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, సీపీ నాగరాజాను సస్పెండ్ చేయాలని పీడీని ఆదేశించారు. ప్రజాసేవే పరమావధిగా అహర్నిశలు కృషి చేస్తుంటే, కొందరు అధికారుల వైఖరి కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మండిపడ్డారు. సక్రమంగా ఈ–క్రాప్ నమోదు చేయకుండా రైతులను నష్టపరచిన మోటుమల్లెల ఆర్‌బీకే సహాయకుడు నరసింహులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో రైతులకు న్యాయం చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గొల్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం కార్యక్రమానికి హాజరై గర్భిణులను ఆశీర్వదించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ నేతలు చెన్నూరు సుబ్బరామయ్య, జయమ్మ, కొమ్మేవాండ్లపల్లెకు చెందిన గోవిందరెడ్డి, లక్ష్మీదేవి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

వినాయకస్వామి సేవలో మంత్రి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు మంత్రికి విన్నవించారు. మంత్రి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

తిరుపతితో కళాతపస్వి అనుబంధం





కె.విశ్వనాథ్‌కు తిరుపతి ఫిలిం సొసైటీ సత్కారం(ఫైల్), నివాళి అర్పిస్తున్న ఫిలిం సొసైటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: సంగీతం, సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో అద్భుత సాహిత్య శోభను చేకూర్చి సంచలన విజయాలతో తెలుగు సినిమా గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన కళాతపస్వి దర్శకుడు కె.విశ్వనాథ్. అంతటి ఖ్యాతిగడించిన సినీ కళాతపస్వికి ఆధ్యాత్మిక తిరుపతి నగరంతో వీడని అనుబంధం ఉంది. సుమారు 35 ఏళ్లుగా తిరుపతి ఫిలిం సొసైటీ నిర్వహించిన కార్యక్రమాలకు హాజరయ్యేవారు. తిరుపతి ఫిలిం సొసైటీ వారు దర్శక ద్యుమణి బిరుదుతో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆయన తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్, అన్నమాచార్య కళామందిరం, అలిపిరి ప్రాంతాలలో స్వాతికిరణం సినిమాను చిత్రీకరించి తిరుపతిపై అభిమానాన్ని చాటుకున్నారు.

విశ్వనాథ్‌కు నివాళి

తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కె.విశ్వనాథ్‌కు ఘన నివాళులర్పించారు. సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్, సభ్యులు పాల్గొన్నారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు నివాళి అర్పించారు.

దరఖాస్తు చేసిన తక్షణమే ఆమోదం

తిరుపతి అర్బన్: కొత్త పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేయడమే ఆలస్యం, వెంటనే ఆమోదం తెలుపుతున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉందని చెప్పారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఐఐసీ పరిధిలోని పరిశ్రమల ఆస్తిపన్ను బకాయిలను యజమానులకు సత్వరమే చెల్లించాలని చెప్పారు. మండల స్థాయిలోనూ బ్యాంకర్లు అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. ప్రధాన మంత్రి ఉపాధి కార్యక్రమంలోనూ పురోగతి చూపాలని తెలిపారు. సింగిల్ డెస్క్ విధానంలో జిల్లాలో 465 పరిశ్రమలకు 450 అనుమతులు ఇచ్చామని, మరో 18 పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. పరిశీలన కమిటీ సూచనల మేరకు 88 పరిశ్రమలకు ప్రోత్సాహకాలుగా రూ.5.10 కోట్లు అందించేందుకు ఆమోదం లభించిందన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ప్రోత్సాహం

- కలెక్టరేట్‌లో అట్టహాసంగా జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమం
- మొదటి విడతలో ముగ్గురు విద్యార్థుల ఖాతాల్లో నగదు జమ



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: విదేశీ విద్యకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తోందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించగా, కలెక్టరేట్‌లో వీక్షించారు. అనంతరం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. కొమ్మిపూడి జీవన్ ప్రకాష్, తల్లిదండ్రులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక ఆదాయం రూ.8లక్షల లోపు ఉన్న వారు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీలకు రూ.1.25కోట్లు వరకు, మిగిలిన వారికి రూ. కోటి వరకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుందని చెప్పారు. జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఈ పథకానికి ఎంపిక అయ్యారని చెప్పారు. ఎస్సీ కేటగిరిలో ఎంపికై ...కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చేయనున్న కె.జీవన్ ప్రకాష్‌కు తొలి విడతలో రూ.6,00,400, బీసీ కేటగిరిలో ఎంపికై అమెరికాలో ఎంఎస్ చేయనున్న రాసక్కగారి ఝాన్సీరాణికి తొలి విడతలో రూ.13,12,641, నడాలో ఎంఎస్ చేయనున్న నాగవరం బాబు రంజిత్‌కు తొలి విడతలో రూ.5,50,000 నగదు వారి ఖాతాల్లో జమ అయిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి చెన్నయ్య, బీసీ సంక్షేమ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, డీఈవో వి.శేఖర్, సమాచార శాఖ జిల్లా అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

పోలీసులకు ‘హీరో’ వాహనాలు



పోలీసులకు అందించిన వాహనాలు



ద్విచక్రవాహనాన్ని అందిస్తున్న హీరో మోటార్స్ చైర్మన్, ఎండీ తదితరులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా శాంతి భద్రతలు, ట్రాఫిక్ భద్రతకు అవసరమయ్యే 120 ద్విచక్ర వాహనాలను హీరో ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తి శుక్రవారం కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డికి అందజేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఆ కంపెనీ వారు చేపట్టిన ఈ వాహనాల వితరణ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీతోపాటు హీరో మోటార్స్ అధినేత మోహన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా గ్లామర్ ద్విచక్ర వాహనాలను జిల్లా పోలీసులకు అందించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులకు హీరో మోటార్స్ ద్విచక్ర వాహనాలు ఇవ్వడం శుభ పరిణామమని చెప్పారు. వీటిలో మైక్, లైట్, సైరన్ సిస్టమ్ వంటివి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, డీఎస్పీలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇంట్లో చోరీ


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్రైం సీఐ

చంద్రగిరి: గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి నగదును దోచుకెళ్లిన ఘటన గురువారం అర్ధరాత్రి స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు, ఆర్‌ఎఫ్ రోడ్డులో అమ్మణ్ణమ్మ నివాసముంటోంది. గత 10 రోజులుగా ఆమెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో 10 రోజుల క్రితం పట్టణంలోనే ఆకుతోట వీధిలో నివాసముంటున్న కొడుకు కిషోర్ వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఏదో శబ్దాలు రావడంతో పక్కింట్లోని వారు కిషోర్‌కు ఫోన్ చేసి తెలిపారు. హుటాహుటిన ఇంటి వద్దకు చేరుకున్న కిషోర్‌ను చూసి గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారు. ఇల్లు పరిశీలించగా ప్రధానగేటు, ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలో ఉంచిన రూ.50వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంగిట్లో ముగ్గు వేస్తుండగా...

నాయుడుపేటటౌన్ : వృద్ధురాలి మెడలోంచి నగలను అపహరించుకెళ్లిన ఈ సంఘటన పట్టణంలోని రాజగోపాలపురంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, వృద్ధురాలు బుజ్జమ్మ ఇంటి ముందు కూర్చుని ముగ్గు వేస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న 4 సవర్ల బంగారు గొలుసు, నల్లపూసల దండ లాక్కొని ఉడాయించాడు. ఈ హఠాత్పరిణామంతో కిందపడిన బుజ్జమ్మ లేచి కేకలు వేసింది. గొంతు కింద గాయం కావడంతో చుట్టు పక్కల వారు గుర్తించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. బుజ్జమ్మ భర్త రామచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌పీఎల్‌లో పరుగుల ప్రవాహం

- హోరెత్తిస్తున్న క్రికెటర్లు
- లీగ్ మ్యాచుల్లో గెలిచి ఫైనల్ బెర్త్‌పై గురి



తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపం తుమ్మలగుంటలోని క్రికెట్ మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీల్లో పరుగుల ప్రవాహం కొనసాగుతోంది. పది ఓవర్ల మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ భారీ లక్ష్యాలను ప్రత్యర్థి జట్టు ముందు ఉంచి సవాళ్లు విసురుతున్నారు. బౌలర్లు సైతం పదునైన బంతులతో వికెట్లు పడగొడుతూ జట్టును విజయపథంలో తీసుకెళుతున్నారు. ఇందులో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం సీనియర్ విభాగంలో నిర్వహించిన 3 మ్యాచుల్లో 6 జట్లు తలపడ్డాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆల్‌రౌండర్లు చక్కటి ప్రదర్శన కనబరిచారు. లీగ్ మ్యాచ్‌లలో సత్తాచాటి ఫైనల్‌లో బెర్త్‌ను ఖరారు చేసుకునేందుకు శ్రమించారు.

గెలుపొందిన జట్లు ఇవే...

- మొదటి మ్యాచ్‌లో ఎస్వీయూ జట్టుపై రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల జట్టు 8పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎమరాల్డ్స్ జట్టు 10ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 87పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్వీయూ జట్టు 10 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 79పరుగులు మాత్రమే చేసింది.
- రెండవ మ్యాచ్‌లో శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ(ఎస్పీఎస్పీ) జట్టుపై ఎస్వీసీఈ-1 జట్టు 53పరుగుల తేడాతో విజయం అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ-1 జట్టు 10ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 103 పరుగులు చేయగా ఎస్పీఎస్పీ జట్టు 10ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి కేవలం 50పరుగులు మాత్రమే చేసింది. ఈ మ్యాచ్‌లో ఎస్వీసీఈ-1జట్టు బ్యాట్స్‌మెన్ తరుణ్‌రాజ్ 42పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు విజయానికి కీలకపాత్ర పోషించాడు.
- మూడవ మ్యాచ్‌లో చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 8వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన చదలవాడ జట్టు 10ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేయగా, తరువాత బ్యాటింగ్ చేసిన శ్రీవిద్యానికేతన్ జట్టు 7ఓవర్లలోనే 2వికెట్ల నష్టానికి 71పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

గెలుపొందిన జట్లు

- రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల జట్టు
- ఎస్వీసీఈ-1 జట్టు
- శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు




విజయం సాధించిన రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఎస్వీసీఈ)-1, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల జట్లు

కాలువలో పడి వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో మురుగు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు కథనం మేరకు, సుమారు 40 ఏళ్ల లోపు వ్యక్తి బ్లూకలర్ జీన్స్ ఫ్యాంట్, నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి ఎడమ చేతిపై రిమ్‌ప్లీ (ఆర్ఐఎంపీఎల్ఈ) అనే పేరు పక్కన లవ్ సింబల్‌తో టాటూ వేసుకుని ఉన్నట్లు సీఐ వెల్లడించారు. మృతుడి ఆనవాళ్లు గుర్తుపట్టలేని విధంగా మురుగు కాలువలో పురుగులు తినేసి ఉన్నట్లు వివరించారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి ఉండడంతో మృతి చెంది నాలుగు రోజులు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మృతుని ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.